సాక్షి
పార్వతీపురం మన్యం

శనివారం । 27 । ఏప్రిల్ । 2024



చేతివృత్తులకు చేదోడు

చేతి వృత్తిదారుల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగింది.

- 8లో



సీఎం సభను విజయవంతం చేద్దాం

మే 1న బొబ్బిలిలో నిర్వహించనున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచార సభను విజయవంతం చేద్దామని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.

- 8లో



ఊరటనిచ్చిన వర్షం

భామిని: మండలంలో శుక్రవారం కురిసిన వానజల్లులతో ఉక్కపోతల నుంచి కాస్తా ఊరట లభించింది. మండుతున్న ఎండల తీవ్రతతో వాతావరణం వేడెక్కి విలవిల లాడుతున్న ప్రజలకు గాలితో కూడిన వాన చల్లదనం అందించింది.

న్యూస్‌రీల్

రామోజీ రోత రాతలు

- సాలూరు వస్తే అభివృద్ధి చూపిస్తా
- వైఎస్సార్‌సీపీ సాలూరు అభ్యర్థి పీడిక రాజన్నదొర



మాట్లాడుతున్న పీడిక రాజన్నదొర

సాలూరు: పత్రికాధినేత రామోజీరావు నిర్వహిస్తున్న ఈనాడు పత్రికలో వచ్చేవి రోతరాతలు, అబద్ధపు మూటలన్న సంగతి తెలుగు రాష్ట్రాల ప్రజలందరికీ తెలుసునని ఉపముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ సాలూరు అసెంబ్లీ ఎమ్మెల్యే అభ్యర్థి పీడిక రాజన్నదొర ఎద్దేవా చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన సాలూరు పట్టణంలోని తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ రామోజీరావు టీడీపీ ఏజెంట్‌గా మారారని విరుచుకుపడ్డారు. ఎన్నికల తరువాత రామోజీరావు వస్తే ఆయనకు విమానం టికెట్ నేనే తీసి చేసిన సాలూరు నియోజకవర్గంలో అభివృద్ధి ఏమిటో చూపిస్తానన్నారు. లేదా ఈనాడు యాజమాన్యం ఎవరైనా వస్తే నియోజకవర్గంలో, మండలాల్లో, నా పంచాయతీలో చేసిన అభివృద్ధి ఏమిటో చూపిస్తానని స్పష్టం చేశారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు పాలనలో అభివృద్ధి జరిగిందో లేక తాను ఎమ్మెల్యే అయిన తరువాత అభివృద్ధి జరిగిందో చూపిస్తా రమ్మంటూ చాలెంజ్ చేశారు.

రూ.1300 కోట్లతో అభివృద్ధి

గతంలో మక్కువ మండలం, పార్వతీపురం నియోజకవర్గంలో ఉండేదని, నాడు టీడీపీ నాయకులే పాలించారన్న విషయం రామోజీరావు గుర్తెరగాలని హితవు పలికారు. ఈనాడు లేకపోతే చంద్రబాబు లేరని ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీ పాలనలో నియోజకవర్గంలో రూ.1300 కోట్లతో అభివృద్ధి చేశామని వివరించారు. నియోజకవర్గంలో 2014 నుంచి 2019 మధ్య టీడీపీ పాలనలో జరిగిన అభివృద్ధి, 2019 నుంచి నేటివరకు వైఎస్సార్‌సీపీ పాలనలో చేసిన అభివృద్ధి గురించి తెలియజేయడానికి సిద్ధంగా ఉన్నామని, దీనిపై చర్చకు రావాలని సవాల్ విసిరారు.

చెక్‌పోస్టు పరిశీలన



చెక్‌పోస్టును పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకుడు రమాకాంత్

బలిజిపేట: మండలంలోని వెంగాపురం సంత తోట వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు రమాకాంత్ శుక్రవారం పరిశీలించారు. రోజువారీ వచ్చిపోయే వాహనాల వివరాలు, వాహనాలను ఏ విధంగా పరిశీలిస్తున్నది? ఇంతవరకు పరిశీలన ఏ విధంగా చేశారన్నది? రికార్డుల నమోదు అంశాలను పరిశీలించారు. అక్కడ ఉన్న సిబ్బందికి కొన్ని సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్‌నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొండలో అగ్నిప్రమాదం

- ట్రావెల్స్ పూరిపాకలు దగ్ధం



ఘటనా స్థలంలో మంటలను అదుపుచేసేందుకు యత్నిస్తున్న ఫైర్ సిబ్బంది, స్థానికులు

పాలకొండ రూరల్: స్థానిక పాతబస్టాండ్ ఆవరణలో శుక్రవారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం సంభవించింది. అక్కడికి సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై పక్షి వాలడంతో నిప్పు రవ్వలు ఎగసిపడి దిగువనున్న పూరిపాకలపై పడడంతో ఈ ప్రమాదం జరిగినట్లు అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు తెలిపారు. ఈ ఘటనలో అరుణ ట్రావెల్స్, సాయిమహేష్ ట్రాన్స్‌పోర్టు, ఎచ్చెర్ల లక్ష్మిలకు సంబంధించిన పూరిపాకలు, ట్రావెల్స్ ఆఫీసులు పూర్తిగా దగ్ధమయ్యాయి. దీంతోపాటు ఆఫీస్ ఫర్నిచర్ తదితర పరికరాలు పూర్తిగా కాలిపోవడంతో రూ.2లక్షల 50వేల ఆస్తినష్టం జరిగి ఉంటుందని అధికారులు అంచనా వేశారు. సమాచారం మేరకు అగ్నిమాపక శకటంతో అధికారులు, సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. ప్రస్తుత వేసవిలో ఈ తరహా ప్రమాదాల నివారణపై అవగాహన పెంచుకోవాలని అగ్నిమాపక అధికారులు ఈ సందర్భంగా అక్కడి ప్రజలకు సూచించారు. జరిగిన నష్టంపై అధికారులకు నివేదిస్తామని బాధితులకు హామీ ఇచ్చారు.

విరిసిన విద్యావనం



నాడు-నేడుతో మారిన సాలూరులోని పాఠశాల రూపురేఖలు



పువ్వు పుట్టగానే పరిమళించిందన్నట్లు నిన్న కాక మొన్న ఏర్పడిన నూతన జిల్లాలో వికసిస్తున్న విద్యాకుసుమాలు రాష్ట్రం మొత్తం జిల్లా వైపు చూసేలా చేస్తున్నాయి. ఒకప్పుడు రాళ్లూరప్పలు, కొండకోనలు, అడవులు, పొదలు దర్శనమిచ్చే పార్వతీపురం ప్రాంతం జిల్లాగా రూపాంతరం చెందిన వెంటనే విద్యా కుసుమాలు విరబూస్తున్న ఘనతను సొంతం చేసుకుంటోంది. పార్వతీపురం మన్యం జిల్లాలో 'ప్రైవేట్' పాఠశాలల హవాకు చెక్ పెట్టి ప్రభుత్వ పాఠశాలలు ముందంజలో నిలుస్తున్నాయి. పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో మెరుగైన మార్కులను ప్రభుత్వ పాఠశాలలు సాధిస్తుండడానికి కారణం.. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన విప్లవాత్మక సంస్కరణలే అని చెప్పడంలో అతిశయోక్తి లేదు. జిల్లాలో సాధిస్తున్న పదో తరగతి పరీక్షా ఫలితాలతో విద్యార్థులు, తల్లిదండ్రుల ఆనందానికి అవధుల్లేకుండా పోతోంది.

–సాక్షి, పార్వతీపురం మన్యం

- మెరుగుపడిన ప్రభుత్వ పాఠశాలలు
- మారిన విద్యార్థుల తలరాతలు
- పదో తరగతి ఫలితాల్లో ముందంజ
- వరుసగా రెండోసారి రాష్ట్రంలో అగ్రస్థానం
- ఆనందంలో విద్యార్థులు, తల్లిదండ్రులు




ఈ విద్యార్థుల పేర్లు కె.బి.గౌతమి(591), ఎస్.మనోజ్‌కుమార్(588). ఇద్దరూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారే. ఇటీవల విడుదలైన పదో తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో గౌతమి జిల్లాలో మొదటి స్థానం సాధించింది. ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని, క్రమశిక్షణతో చదవడం వల్ల ఉత్తమ ఫలితాలు సాధించామని వారు చెబుతున్నారు.



నిన్నమొన్నటి వరకు ప్రభుత్వ పాఠశాలలంటే అందరిలో చిన్నచూపు ఉండేది. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పాసయ్యారంటే గొప్పే అనుకునేవారు. అలాంటిది పదో తరగతిలో 500 మార్కులు దాటితే అబ్బో అని చూసేవారు. ఇప్పుడు పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో జిల్లాలో మొదటి స్థానం ప్రభుత్వ పాఠశాల విద్యార్థినికి(591 మార్కులు) రావడం.. ప్రైవేట్ విద్యాసంస్థలను సైతం దిగ్భ్రాంతికి గురిచేస్తోంది.

గొప్పగా ప్రభుత్వ సంకల్పం

కార్పొరేట్ పాఠశాలలకే సాధ్యమనుకునే ఈ తరహా మార్కుల సాధన, ప్రతిభకు రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం, సహకారం ఎంతైనా ఉంది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో తీసుకొచ్చిన సంస్కరణలు ప్రభుత్వ పాఠశాలల చరిత్రను తిరగరాస్తున్నాయి. తద్వారా విద్యార్థుల తలరాతలూ మారుతున్నాయి. గతేడాది పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రంలోనే పార్వతీపురం మన్యం జిల్లా 87.47 స్థానం సాధించి ప్రథమస్థానంలో నిలిచింది. ఈ ఏడాది దాన్ని మరింత మెరుగుపరుచుకుని..మళ్లీ అగ్రస్థానాన్ని నిలబెట్టుకుని 96.37 శాతంతో రికార్డు సృష్టించింది. ప్రభుత్వం కల్పించిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఈ స్థాయికి చేరుకున్నారని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అంటున్నారు.

ముందుకు నడిపిస్తున్న పథకాలు

'నాడు–నేడు' పథకం అమలుతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయి. జిల్లాలో తొలిదశలో 486 పాఠశాలల్లో రూ.130.14 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయి. రెండో విడతలో రూ.144.51 కోట్లతో 535 పాఠశాలల్లో ఆధునికీకరణ పనులు చేపట్టారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా వసతులు కల్పించారు. తాగునీరు, విద్యుత్ సౌకర్యం, ఫర్నిచర్, గ్రీన్‌చాక్ బోర్డు, కిచెన్ షెడ్డు, ఇంగ్లిష్ ల్యాబ్, రంగులు తదితర పనులు చేపట్టారు. అక్కడితో ఆగిపోకుండా పాఠశాలల నిర్వహణ కోసం ఏటా దాదాపు రూ.6 కోట్ల వరకు ప్రభుత్వం వెచ్చిస్తోంది. దీనివల్ల విద్యార్థులు ఆసక్తిగా, స్వేచ్ఛగా చదువుకునే వాతావరణం కలుగుతోంది.

ఈ ఏడాది వివిధ యాజమాన్యాల పరిధిలో పదో తరగతి ఫలితాలు..

యాజమాన్యం	మొత్తం ఉత్తీర్ణత	శాతం	అత్యధిక మార్కులు
బీసీ వెల్ఫేర్	140	100	574
ప్రభుత్వ పాఠశాలలు	337	89	571
టీడబ్ల్యూ ఆశ్రమ పాఠశాలలు	2192	98	567
కేజీబీవీ	479	97	569
మున్సిపల్	478	94	591
ఏపీ మోడల్ స్కూల్	353	99	583
సోషల్ వెల్ఫేర్	372	99	557
ఏపీటీడబ్ల్యూఆర్ఐఈఎస్	714	100	580
జిల్లా పరిషత్	3578	94	588
ప్రైవేట్ అన్‌ఎయిడెడ్	1421	99	590
మొత్తం	10064	96.37	

తల్లిదండ్రులకు తగ్గిన భారం

ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి పదో తరగతి వరకు చదివే పిల్లలకు జగనన్న విద్యాకానుక కిట్లను ఏటా ప్రభుత్వం అందిస్తోంది. ఇందులో మూడు జతల యూనిఫాం దుస్తులు(క్లాత్), బూట్లు, రెండు జతల సాక్సులు, బెల్టు, ఒక సెట్ పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, డిక్షనరీ వంటివి ఉంటాయి. జిల్లాలో ఏటా సుమారు 96 వేల మంది విద్యార్థులు ఈ లబ్ధి పొందుతుండగా..ప్రభుత్వం ఇందుకోసం రూ.18 కోట్లకుపైగా ఖర్చు చేస్తోంది.

డ్రాపౌట్ల నివారణ లక్ష్యం ..

బడిఈడు పిల్లలు పాఠశాలల్లోనే ఉండాలన్న ఉద్దేశంతో ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమ్మ ఒడి పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం కింద పిల్లలను బడికి పంపించిన తల్లుల ఖాతాల్లో రూ.15 వేలు చొప్పున ఏటా జమ చేస్తోంది. జిల్లాలో ప్రతి ఏడాదీ 83 వేల మందికి పైగా పిల్లల తల్లులు రూ.129 కోట్ల మేర అమ్మఒడి పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం

జగనన్న గోరుముద్ద పథకం ద్వారా జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు బలవర్ధకమైన పౌష్టికాహారాన్ని ప్రభుత్వం అందిస్తోంది. అన్నం, పప్పు, రసం, కూరలతో పాటు..వారానికి ఐదు రోజులు కోడిగుడ్లు, చిక్కీ, రాగిజావ అందిస్తున్నారు.

అందుబాటులోకి డిజిటల్ బోధన

'ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో లేనివిధంగా డిజిటల్ బోధనను ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులోకి వచ్చింది. తొలివిడతలో 221 ప్రాథమిక పాఠశాలలకు 928 ఐఎఫ్‌పీ స్మార్ట్ టీవీలు, రెండో విడతలో 338 పాఠశాలలకు 873 ఐఎఫ్‌పీఎస్ స్మార్ట్ టీవీలు వచ్చాయి. వీటిని ఆయా పాఠశాలల తరగతి గదుల్లో ఏర్పాటు చేశారు. వాటి ద్వారానే బోధన సాగుతోంది. ఇవే కాక, బైజూస్ కంటెంట్‌తో ఇన్‌స్టాల్ చేసిన ట్యాబ్‌లను ఎనిమిదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందజేస్తోంది. జిల్లాలో గతేడాది సుమారు 8,183 మంది విద్యార్థులకు రూ.35.23 కోట్లు ఖర్చు చేసి వీటిని అందజేసింది.

ప్రభుత్వ పాఠశాలలే మెరుగు



గతంతో పోల్చుకుంటే ప్రభుత్వ పాఠశాలలు చాలా మెరుగయ్యాయి. మా అమ్మాయి హేమలత పాడి పాలకొండ ప్రభుత్వ పాఠశాలలో గతేడాది చదివింది. 587 మార్కులు సాధించింది. ఇప్పుడు నూటికి నూరు శాతం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు మెరుగుపడ్డాయి. ఉచిత విద్యతోపాటు, నాడు–నేడు, అమ్మ ఒడి, గోరుముద్ద, విద్యాకానుక పథకాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

– హరిశ్చంద్ర, అర్చకుడు, అంపిలి గ్రామం, పాలకొండ మండలం







టీడీపీకి బై..బై..!



పార్టీలో చేరిన అజ్జాడ టీడీపీ నాయకులను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

- వీడ్కోలు పలికిన తెలుగు తమ్ముళ్లు
- వైఎస్సార్‌సీపీలో 300 కుటుంబాల చేరిక
- ఆహ్వానించిన ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం నియోజకవర్గంలో టీడీపీకి భారీ షాక్ తగిలింది. ఈ మేరకు శుక్రవారం మండలంలోని అజ్జాడ గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు టీడీపీ ఆవిర్భావం నుంచి పనిచేస్తూ మూడు పర్యాయాలు సర్పంచ్‌గా విధులు నిర్వహించిన అక్కెన రామ్మూర్తి నాయుడు తన అనుచరులు 300 కుటుంబాల వారు తెలుగుదేశం పార్టీకి షాక్ ఇచ్చి ఎమ్మెల్యే జోగారావు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. 2024 సాధారణ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అలజంగి జోగారావు భారీ విజయాన్ని సాధించడమే లక్ష్యంగా పనిచేసి.. పార్వతీపురం నియోజకవర్గాన్ని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మళ్లీ కానుకగా ఇచ్చి ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నదే తమ ధ్యేయమని పార్టీలో చేరిన వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అభ్యర్థి జోగారావు మాట్లాడుతూ పార్వతీపురం నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, వార్డుల్లోనూ పార్టీ బలోపేతంపై వందశాతం దృష్టి సారించామన్నారు. వైఎస్సార్‌సీపీలో చేరినవారిలో ఎక్స్ సర్పంచ్ అక్కెన రామ్మూర్తి నాయుడు, ఎక్స్ పీఏసీఎస్ చైర్మన్ అక్కెన జగన్నాథంనాయుడు, సీనియర్ నాయకులు అక్కెన శ్రీనివాసరావు, అక్కెన తిరుమల రావు, చింత కేశవ నాయుడు, దత్తి కృష్ణమూర్తి నాయుడు, కర్రి కాశీనాయుడు, అక్కెన సూర్యనారాయణ, స్కూల్ కమిటీ చైర్మన్ పూతి శ్రీనివాసరావు, చింతాడ దయాలతో పాటు గ్రామానికి చెందిన కార్యకర్తలు, వారికి చెందిన 300 పైచిలుకు కుటుంబాల వారున్నారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు డాక్టర్ ద్వారపురెడ్డి రామ్మోహన్‌రావు, కొయ్యాన శ్రీవాణి, గ్రామ వైస్ సర్పంచ్ రణదేవ్ లక్ష్మణరావు, గ్రామ నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

బలిజిపేటలో..

బలిజిపేట మండంలోని పెద్దింపేట గ్రామానికి చెందిన పలువురు ప్రతిపక్ష టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అలజంగి జోగారావు సమక్షంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన ఎక్స్ సర్పంచ్ గుర్రాన కాశీవిశ్వనాథం, కండాపు ఈశ్వరరావు, గుర్రాన భాస్కరరావులతో పాటు వారి కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే అభ్యర్థి జోగారావు కండువాలు వేసి సాదరంగా వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు.



పెద్దింపేటలో ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జోగారావు, వైఎస్సార్‌సీపీ అరకు ఎంపీ అభ్యర్థి తనూజారాణి

సాలూరులో టీడీపీ, బీజేపీలకు షాక్

- వైఎస్సార్‌సీపీలో చేరిన ఆయా పార్టీల నాయకులు
- ఆహ్వానించిన సాలూరు ఎమ్మెల్యే, అరకు ఎంపీ అభ్యర్థులు

సాలూరు: పట్టణంలోని పలువార్డుల్లో టీడీపీ, బీజేపీలకు చెందిన పలువురు ఆ పార్టీలను వీడి వైఎస్సార్‌సీపీలో శుక్రవారం చేరారు. పార్టీలో చేరిన వారికి వైఎస్సార్‌సీపీ సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థి పీడిక రాజన్నదొర, అరకు ఎంపీ అభ్యర్థి గుమ్మ తనూజ రాణి కండువాలను వేసి సాదరంగా ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీలో చేరిన వారిలో సాలూరు పట్టణంలోని 6వ వార్డుకు చెందిన టీడీపీ అరకు పార్లమెంట్ జనరల్ సెక్రటరీ షేక్ అబ్దుల్, టీడీపీ, బీజేపీలకు చెందిన పీబీఎస్ రాజు, యుగంధర్, గోవింద, వెంకటేష్, పరశు, నబీ, కృష్ణ, నాన, దేవేంద్ర, విక్రమ్, కర్రిశేషు, కోలగట్ల గోపాలరావు, సత్యసారథి, రాము, చంద్రశేఖర్, ఉపేంద్ర, వినోద్, జాను, గోవింద, శంకర్రావు తదితరులు ఉన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు. పార్టీ నాయకులు వంగపండు అప్పలనాయుడు, జర్జాపు సీలిమ, గిరి రఘు, రౌతు అప్పారావు, పప్పల లక్ష్మణ, మాధవరావు, పిరిడి రామకృష్ణ, కిలారి రవి పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో పీడిక రాజన్నదొర

రీ వెరిఫికేషన్ అవకాశం

- ఈనెల 30 వరకు పదో తరగతి విద్యార్థులకు చాన్స్



జి.పగడాలమ్మ

పార్వతీపురం: పదవ తరగతి పరీక్షలలో ఫెయిలైన విద్యార్థులకు విద్యాసంవత్సరం నష్టపోకుండా మే నెలలో అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. మార్కులు తక్కువ వచ్చినట్లు అనుమానం ఉన్న వారు పునఃమూల్యాంకనం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

ఈ నెల 30లోగా..

పది పరీక్షలు రాసిన విద్యార్థులు పునఃమూల్యాంకనం కోసం ఈనెల 30లోగా బీఎస్ఈ.ఏపీ.జీఓవీ. ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. జవాబు పత్రాలు రీ కౌంటింగ్/రీ వెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు సంబంధిత పాఠశాల హెచ్ఎంల ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఫీజులను ప్రధానోపాధ్యాయులకు మాత్రమే చెల్లించాలి. రీ వెరిఫికేషన్ ఫీజు ఒక్కో సబ్జెక్టుకు రూ. 1000, రీ కౌంటింగ్‌కు ఒక్కో సబెక్టుకు రూ.500 చెల్లించాలి. అభ్యర్థులు వారి దరఖాస్తులను సంబంధిత పాఠశాల హెచ్ఎంలతో అటెస్టేషన్ చేయించి, విద్యాశాఖ కార్యాలయంలో సమర్పించాలి.

మే 24నుంచి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు

పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మే 24 నుంచి జూన్ 3వ తేదీవరకు నిర్వహించనున్నారు. అడ్వాన్స్‌డ్ పరీక్షలకు హాజరు కావాలనుకునే విద్యార్థులు పరీక్ష ఫీజును ఆన్‌లైన్‌లో డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.జీఓవీ.ఇన్‌లో చెల్లించాలి. అపరాధరుసుం లేకుండా ఈనెల 30లోగా ఆన్‌లైన్‌లోనే చెల్లించాలని డీఈఓ జి.పగడాలమ్మ స్పష్టం చేశారు.

క్లుప్తంగా

ఓపెన్ టెన్త్ ఫలితాల్లో 6వ స్థానం


సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ జి.పగడాలమ్మ

పార్వతీపురంటౌన్: ఏపీ సార్వత్రిక విద్యాపీఠం పదోతరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు డీఈఓ జి. పగడాలమ్మ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పదోతరగతి ఫలితాల్లో రాష్ట్రంలో మన్యం జిల్లా 6వ స్థానంలో నిలవగా ఇంటర్మీడియట్ ఫలితాల్లో 12వ స్థానంలో నిలిచిందన్నారు. జిల్లాలో 680మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలకు హాజరు కాగా 531మంది ఉత్తీర్ణులై 78.09శాతం ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. అలాగే ఇంటర్మీడియట్‌లో 465మందికి గాను 291మంది హాజరూ 62.58శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు.

పరీక్షల్లో తప్పిన వారికి జూన్ 1 నుంచి 8వ తేదీ వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ మేరకు పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు పదోతరగతి, ఇంటర్మీడియట్ రీకౌంటింగ్‌కు రూ200, రీ వెరిఫికేషన్‌కు రూ.1000 ఈనెల 29 నుంచి మే 7 వరకు ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని వివరించారు.

ఎన్నికల నియమావళి ఉల్లంఘన

- అనుమతి లేకుండా ప్రచారం


మాట్లాడుతున్న సినీనటుడు పృథ్వీరాజ్

వీరఘట్టం: మండల కేంద్రంలో జనసేన స్టార్ క్యాంపెయినర్, సినీనటుడు పృథ్వీరాజ్ ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారు. ఎటువంటి అనుమతి లేకుండానే వీరఘట్టంలోని జూనియర్ కాలేజీ జంక్షన్ నుంచి అంబేడ్కర్ జంక్షన్ వరకు ర్యాలీ చేపట్టారు.అనంతరం వీరఘట్టం పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆయన జనసేన పార్టీ గురించి మాట్లాడడం చర్చనీయాంశమైంది. ఇది ముమ్మాటికీ ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించడమేనని అధికారులు అంటున్నారు. ఈ ర్యాలీకి అనుమతి ఉందా? లేదా? అని వీరఘట్టం నోడల్ అధికారి సుబ్రహ్మణ్యం వద్ద సాక్షి ప్రస్తావించగా ఎటువంటి అనుమతులు లేవని స్పష్టం చేశారు. అనుమతి లేకుండా ర్యాలీ చేపట్టినందుకు ఆయనపై ఎన్నికల నియమావళి ప్రకారం తగుచర్యలు తీసుకుంటామని ఎంసీసీ సుబ్రహ్మణ్యం చెప్పారు.

ప్రజాస్వామ్యం గొప్పతనాన్ని కాపాడాలి

- ఎన్నికల రాష్ట్ర పోలీస్ అబ్జర్వర్ దీపక్ మిశ్రా


మాట్లాడుతున్న దీపక్ మిశ్రా

పార్వతీపురం: ప్రజాస్వామ్యం గొప్పతనాన్ని కాపాడాలని ఎన్నికల రాష్ట్ర పోలీస్ అబ్జర్వర్ దీపక్ మిశ్రా అన్నారు. ఈ మేరకు పార్వతీపురం మన్యం జిల్లాలో శుక్రవారం పర్యటించిన ఆయన కలెక్టరేట్‌లో జిల్లా ఉన్నతాధికారులు, పోలీసు అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాస్వామ్యం పట్ల విశ్వాసంతో ప్రతి ఒక్కరూ పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల నిర్వహణ ప్రశాంతంగా, సజావుగా నిర్వహించాలంటే ఒక్కటే అజెండా ఉండాలని, ఏ ఇతర అజెండా ఉండరాదని స్పష్టం చేశారు. ఎన్నికల్లో తప్పులు చేస్తే ఉద్యోగి జీవితంలో ఇబ్బందులు ఎదురవుతాయని, ఉద్యోగ బాధ్యతలను నిజాయితీ, విశ్వాసంతో నిర్వహించాలని చెప్పారు. కలెక్టర్, ఎన్నికల అధికారి నిషాంత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలను చేపట్టామని చెప్పారు. డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన కళాశాలలో నాలుగు నియోజకవర్గాల కౌంటింగ్ ఏర్పాటు చేశామని, పాడేరు, రంపచోడవరంలలో కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. జిల్లాలో పనిచేస్తున్న ఎన్నికల వివిధ బృందాలు, కంట్రోల్ రూం పని విధానాన్ని వివరించారు. ఎస్పీ విక్రాంత్‌పాటిల్ మాట్లాడుతూ పోలీసు శాఖాపరంగా చేపడుతున్న చర్యలను వివరించారు. సమావేశంలో అదనపు డీజీపీ డా.శంకబ్రత బాగ్చి, పార్లమెంట్ నియోజకవర్గ సాధారణ, పోలీసు పరిశీలకుడు ప్రమోద్‌కుమార్ మెహర్దా, నయీం ముస్తఫా మన్సూరి, విశాఖ రేంజ్ డీఐజీ విశాల్ గున్నీ, జేసీ ఎస్ఎస్ శోభిక, అదనపు ఎస్పీ డా.ఒ.దిలీప్‌కిరణ్, ఏఎస్పీ సునీల్ షరోన్, పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు, ఎస్‌డీసీ ఆర్వీ సూర్యనారాయణ పాల్గొన్నారు.

చేతివృత్తులకు చేదోడు


జగనన్న చేదోడు చెక్కు విడుదల చేస్తున్న సీఎం జగన్ మోహన్‌రెడ్డి (ఫైల్)

- వృత్తిదారులకు ఆర్థిక భరోసా
- నాయీ బ్రాహ్మణులు, రజకులు, టైలర్‌లకు లబ్ధి
- ఏటా రూ.10,000 ఆర్థిక సాయం
- సంతోషంలో లబ్ధిదారులు

నాలుగు విడతల్లో లబ్ధిదారుల వివరాలు ఇలా

సంవత్సరం	రజకులు	నాయీ బ్రాహ్మణులు	టైలర్లు	మొత్తం లబ్ధిదారులు	చేకూరిన లబ్ధి రూ కోట్లలో
2020–21	2707	1066	3392	7165	7.16
2.21–22	2523	993	3330	6846	6.84
2022–23	3036	1150	4007	8193	8.19
2023–24	2926	1090	5463	9522	9.52
మొత్తం	11,192	4,299	16,192	31,756	31.71

పార్వతీపురం టౌన్: చేతి వృత్తిదారుల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగింది. రాష్ట్రంలో రజక, నాయీ బ్రాహ్మణ, టైలర్లకు ఏడాదికి రూ.10 వేలు చొప్పున వైఎస్సార్ చేదోడు పథకం కింద ఆర్థిక సాయం అందజేసింది. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటివరకు నాలుగు విడతల సాయం అందిచారు. లబ్ధిదారులతో దరఖాస్తు చేయించడం, ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేయడంలో లో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది కీలక పాత్ర పోషించారు. ఏటా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి బటన్ నొక్కి నేరుగా డీబీటీ ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లో రూ.10 వేలు జమ చేశారు. ఈ మొత్తం వృత్తి సామగ్రి కొనుగోలు చేసుకోవడానికి, వృత్తి అభివృద్ధికి దోహదపడ్డాయి.

ఏటా సాయంతో సంతోషం

జగనన్న ప్రభుత్వం ఏటా ఇచ్చే రూ.10 వేలను రజకులు, టైలర్లు, నాయీ బ్రాహ్మణులు సద్వినియోగం చేసుకుంటున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రమం తప్పకుండా ఆర్థిక సాయం అందించడంపై ఆయా వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. వైఎస్సార్ చేదోడుతో పాటు తమ కుటుంబాలకు అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, చేయూత, ఆసరా, రైతు భరోసా వంటి పథకాలు కూడా అందుతున్నాయని వృత్తిదారులంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీ హయాంలో మొండిచేయి

టీడీపీ హయాంలో వృత్తిదారులకు మొండి చేయి చూపించారు. వారికి మేలు చేయకుండా చిన్న చూపు చూసి మాట్లాడిన సందర్భాలు కోకొల్లలు. స్వయానా చంద్రబాబు గతంలో నాయీ బ్రాహ్మణుల తోకలు కత్తిరిస్తానని తిరుపతిలో వ్యాఖ్యానించడంతోనే టీడీపీకి వృత్తిదారులంటే ఎన్నడూ చిన్నచూపో అర్థమవుతోంది.

31,756 మందికి రూ. 31.71 కోట్లు

వైఎస్సార్ చేదోడు పథకానికి సంబంధించి నాలుగు విడతల్లో పార్వతీపురం మన్యం జిల్లాలోని 31,756 మందికి రూ.31.71 కోట్ల లబ్ధి చేకూరింది. 2021లో 7165 మందికి, 2022లో 6846 మందికి, 2023లో 8193, 2024లో 9522 మందికి జిల్లా వ్యాప్తంగా లబ్ధి చేకూరింది.

గతంలో ఏ ప్రభుత్వమూ సాయం చేయలేదు



నేను నాయీ బ్రాహ్మణ వృత్తిలో పదేళ్లుగా జీవనం కొనసాగిస్తున్నాను. నాకు గతంలో ఏ ప్రభుత్వం సహాయం చేయలేదు. వైఎస్సార్ చేదోడు పథకం ద్వారా నాలుగు విడతల్లో ఇప్పటికే రూ.40 వేలు అందుకున్నాను. ఇళ్ల వద్దకే వలంటీర్లు వచ్చి అవసరమైన పత్రాలను సచివాలయ సిబ్బందికి అందజేసి ఈకేవైసీ కూడా పూర్తి చేసేవారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మాకు ఇచ్చిన మాట ప్రకారం ఆర్థిక సాయం చేయడం సంతోషం.

–బొండపల్లి ఆదిబాబు, నాయీబ్రాహ్మణుడు, పార్వతీపురం

జగన్ బాబు అండగా నిలిచారు



నేను రజక కులస్తుడును. కులవృత్తి చేసుకుంటూ జీవనాన్ని కొనసాగిస్తున్నాను. సామగ్రి కొనుగోలు చేయడానికి ఆర్థిక స్తోమత లేక చాలా ఇబ్బందులు పడేవాడ్ని. గతంలో మాకు ఆర్థిక సాయం చేసిన ప్రభుత్వాలు లేవు. మాలాంటి పేదల కష్టాలను తెలుసుకున్న జగన్‌బాబు ఏటా రూ. 10వేలు మాకు అందిచారు. ఇప్పటి వరకు రూ.40వేలు అందుకున్నాను. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటాను.

– గురాన పైడిరాజు, రజక కులస్తుడు, పార్వతీపురం

మాకు అండగా నిలుస్తున్నారు



ప్రజాసంకల్పయాత్రలో మా కష్టాలను అప్పటి ప్రతిపక్ష నేత జగన్‌మోహన్ రెడ్డికి విన్నవించుకున్నాం. ఆనాడే మాకు ఆయన మాటిచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మీ కష్టాలను తీరుస్తానన్నారు. ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నేటి వరకు నాకు రూ.40వేలు జమ చేశారు. చంద్రబాబు మాకు గతంలో ఏ రకమైన సాయం చేయలేదు. వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్ రెడ్డినే మళ్లీ గెలిపించుకుంటాం.

పాతుర్ని సంతోష్‌కుమార్, టైలర్, పార్వతీపురం

ప్రచారంలో అదే జోరు

ప్రచార పర్వం

నామినేషన్ల ఘట్టం, పరిశీలన పూర్తయిన నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు పార్వతీపురం మన్యం జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం జోరుగా కొనసాగిస్తున్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకులతో కలిసి గ్రామాల్లో పర్యటిస్తూ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు.


సాలూరు: పట్టణంలోని 6వ వార్డులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీడిక రాజన్న దొర


భామిని: నులకజోడులో జరిగిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ పాలకొండ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వాసరాయి కళావతి


పార్వతీపురం టౌన్: అంటివసలో ఎన్నికల ప్రచారం చేస్తున్న పార్వతీపురం ఎమ్మెల్యే అభ్యర్థి అలజంగి జోగారావు

బొబ్బిలిలో సీఎం సభను

విజయవంతం చేద్దాం

- కార్యకర్త నుంచి నాయకుల వరకు బాధ్యత తీసుకోవాలి
- మే 1 ఉదయం 10 గంటలకు బొబ్బిలికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి
- బొబ్బిలిలో గెలుపు జెండా ఎగురవేద్దాం
- వైఎస్సార్ సీపీ డిప్యూటీ జోనల్ కో ఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు


మాట్లాడుతున్న రీజనల్ డిప్యూటీ కోఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు

బొబ్బిలి: వచ్చేనెల 13న జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయంలో బొబ్బిలి పాత్ర ఉండాలని, మే 1న ఇక్కడ నిర్వహించనున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచార సభను విజయవంతం చేద్దామని పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులకు వైఎస్సార్ సీపీ డిప్యూటీ జోనల్ కో ఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. బొబ్బిలి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అధ్యక్షతన శుక్రవారం జరిగిన నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. బొబ్బిలిలో 15 సంవత్సరాలు పరిపాలించిన వారు ఏం చేశారో ఏం చేస్తారో చెప్పకుండా.. తమను చూసి ఓటేయమని అడగడం సిగ్గు చేటన్నారు. నాయకుల దగ్గర నుంచి ప్రజల వరకు అందరూ ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ రావాలని కోరుకుంటున్నారన్నారు. విద్య, వైద్యం, సంక్షేమం, అభివృద్ధి పనులతో జనం గుండెల్లో జగన్ స్థానం సంపాదించారన్నారు. ప్రస్తుత ఎన్నికలు శంబంగి గెలుపు కోసం, సీఎం జగన్ గెలుపు కోసం మాత్రమే కాదని, ప్రజల జీవన ప్రమాణాల స్థిరత్వం కోసమని ప్రతీ ఒక్కరూ గ్రహించాలన్నారు. మే1న ఉదయం 9 గంటలకు ప్రజలందరూ సీఎం సభా వేదిక వద్దకు చేరుకునేలా వైఎస్సార్‌సీపీ నాలుగు మండలాల నాయకులు, పట్టణ నాయకులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. ముందుగానే అన్ని సిద్ధం చేసుకుని సీఎం సభా ప్రాంగణాన్ని తీర్చిదిద్దాలన్నారు.

- ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో ఈ నెల 24వరకు జరిగిన 'మేమంతా సిద్ధం' సభలను మించిపోయేలా బొబ్బిలి ఎన్నికల ప్రచార బహిరంగ సభను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రతీ గ్రామం నుంచి జగనన్న ప్రభుత్వంలో లబ్ధి పొందిన వారంతా సభకు వచ్చేందుకు ఆసక్తి కనబరుస్తారన్నారు.
- బొబ్బిలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎన్నికల పరిశీలకుడు మావుడి శ్రీనివాసరావు మాట్లాడుతూ నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, పట్టణంలోని 31 వార్డుల నుంచి ప్రజలు సభాస్థలికి నిర్ణీత సమయంలో చేరేలా ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్, ఎంపీటీసీలు చర్యలు తీసుకోవాలని కోరారు. పెద్దసంఖ్యలో హాజరై ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుదామన్నారు.
- మాజీ మంత్రి పెద్దింటి జగన్మోహనరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పరిపాలనా సామర్థ్యాన్ని చూసిన జనం తప్పకుండా ఆయనను చూసేందుకు మళ్లీమళ్లీ వస్తారన్నారు. సంక్షేమ పాలన అందించడంలో జగన్‌ను మించిన వారు లేరని, ఆయన పాల్గొనే బహిరంగ సభను విజయవంతం చేద్దామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక మండలి మాజీ సభ్యుడు తూముల భాస్కరరావు, మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్‌నాయుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఇంటి గోపాల రావు, వైద్యవిభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బొత్స కాశినాయుడు, ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు తూముల రామసుధీర్, జేసీఎస్ జిల్లా, నియోజకవర్గ ఇన్‌చార్జిలు శంబంగి శ్రీకాంత్, శంబంగి వేణుగోపాలనాయుడు, నాలుగు మండలాల జేసీఎస్ ఇన్‌చార్జిలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, మున్సిపల్ కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జిలు, సీనియర్ కార్యకర్తలు పాల్గొన్నారు.


హాజరైన నాయకులు, కార్యకర్తలు

మీకు తెలుసా?

ఓటరును ప్రలోభపెడితే శిక్ష



పార్వతీపురం:

సాధారణ ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెడితే తీవ్ర నేరంగా పరిగణించి వివిధ చట్టాల కింద కేసు నమోదు చేస్తారు. ఓటర్లను ఒత్తిడికి గురిచేయడం, బెదిరించడాన్ని తీవ్రమైన నేరంగా పరిగణిస్తారు. ఇలా చేసినట్లు రుజువైతే ఐపీసీ 171 (సి) ప్రకారం కేసు నమోదు చేస్తారు. ఓటర్లకు మద్యం పంపిణీ చేసేందుకు భారీ మోతాదులో రవాణా చేస్తూ పట్టుబడితే అబ్కారీ చట్టం ప్రకారం కేసు నమోదు చేస్తారు. ఓట్ల కోసం డబ్బు పంపిణీ చేస్తే ఐపీసీ 171(హెచ్) కింద, మద్యం, ఇతర కానుకలు పంపిణీ చేస్తే ఐపీసీ 171(ఇ) కింద కేసు నమోదు చేస్తారు. ఎన్నికల్లో ఖర్చుల వివరాలు చూపకుంటే ఐపీసీ 171(ఐ) కింద కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటారు. ఓట్ల కోసం కులం, మతం, ఓ సామాజిక వర్గాన్ని రెచ్చగొట్టేలా ప్రసంగాలు చేయడం, ఎదుట వ్యక్తుల మనోభావాలను కించపరచడం చేస్తే ప్రజా ప్రాతినిధ్య చట్టం కింద కేసు నమోదు చేస్తారు. అభ్యర్థులకు కేటాయించిన సమయానికి మించి వాడుకోవడం, నిబంధనలకు విరుద్ధంగా ప్రచార సామగ్రిని వినియోగిస్తే కేసు నమోదుచేసి చర్యలు తీసుకుంటారు.

'అరకు'లో 8 నామినేషన్ల

తిరస్కరణ

పార్వతీపురం: ఈనెల 18నుంచి 25వరకు అరకు పార్లమెంట్‌కు సంబంధించి దాఖలైన 32మంది నామినేషన్లలో ఎన్నికల అధికారి నిషాంత్ కుమార్ అభ్యర్థుల సమక్షంలో శుక్రవారం పరిశీలించారు. ఈ పరిశీలనలో మొత్తం దరఖాస్తులలో 16 ఆమోదం పొందగా 8 తిరస్కరణకు గురయ్యాయి.

తిరస్కరణకు గురైన నామినేషన్ల వివరాలు

కె. బాలుదొర	స్వతంత్ర
బిడ్డిక రామారావు	గోండ్వానా దండకారణ్య పార్టీ
ఎస్. భవాని	స్వతంత్ర
సురేంద్ర కిల్లో	సీపీఐ(ఎం)
శెట్టివినయ్	వైఎస్సార్‌సీపీ
వెంకటరావు జోరంగి	స్వతంత్ర
హేమానాయక్ వడితే	స్వతంత్ర
ఉర్లక త్రినాథ	స్వతంత్ర

సంధ్యారాణికి

అసమ్మతి సెగ!

- టీడీపీ అధిష్టానం కలిపినా కలవని మక్కువ మండల టీడీపీ నాయకుడు
- సంధ్యారాణి తీరుపై భగ్గుమంటున్న ఆయన వర్గం
- ఎమ్మెల్సీగా పనిచేసిన సయమంలో ఖాతరు చేయకపోడమే కారణం!
- కలవని పెంట, గుమ్మడి వర్గాలు



మక్కువ: సాలూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మడి సంధ్యారాణికి అసమ్మతి సెగ రోజురోజుకూ రాజుకుంటోంది. ఎమ్మెల్సీగా పనిచేసిన సమయంలో ఈ ప్రాంత నాయకులను పట్టించుకోకపోవడం, అభివృద్ధిని విస్మరించడంతో ఆమె అభ్యర్థిత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఎమ్మెల్సీగా ఆరేళ్ల పాటు కొనసాగిన ఆమె.. కనీసం ఆమె స్వగ్రామం కవిరిపల్లి అభివృద్ధిని పట్టించుకోలేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే డిప్యూటీ సీఎం రాజన్నదొర చొరవతో సుమారు రూ.80లక్షల వ్యయంతో ఆ గ్రామానికి రోడ్డు, తాగునీటి సదుపాయం, సచివాలయం, ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్, గ్రామంలోని లబ్ధిదారులకు వివిధ సంక్షేమ పథకాల కింద ఆర్థిక ప్రయోజనం చేకూరిందని, వైఎస్సార్‌సీపీ సీపీ ప్రభుత్వ 58నెలల పాలనలో ప్రగతిపట్టాలెక్కిందన్నది ఈ ప్రాంతీయుల మాట. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని సంధ్యారాణిపై ఈ ప్రాంత టీడీపీ నాయకులు గుర్రుగా ఉన్నారు. తొలి నుంచి మక్కువ టీడీపీ మాజీ మండలాధ్యక్షుడు పెంట తిరుపతిరావు ఆమెకు వ్యతిరేకంగానే పనిచేస్తున్నారు. టీడీపీ పెద్దలు కలిపినా.. ఇద్దరి మధ్య సయోధ్యకుదరలేదన్న వాదన వినిపిస్తోంది. ఇటీవల ఆమె నామినేషన్‌కు తిరుపతిరావు వర్గం గైర్హాజరుకావడం దీనికి మరింత బలాన్ని చేకూర్చింది. మరోవైపు అరకు బీజేపీ ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీత ఇటీవల సంధ్యారాణి, పెంట తిరుపతిరావు వర్గాలతో వేర్వేరుగా సమావేశం కావడం గమనార్హం. వాస్తవంగా క్షేత్రస్థాయిలో టీడీపీ కోసం పనిచేసే తిరుపతిరావు అంటే సంధ్యారాణికి ఎప్పుడూ నప్పదని, చిన్నచూపు చూస్తారని పార్టీ కార్యకర్తలు కొందరు బహిరంగంగా చెబుతున్నారు. దీంతో ఆయన కూడా ఎన్నికల్లో తన సత్తా చూపించేందుకు సిద్ధమవుతున్నట్లు భోగట్టా.